# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 346 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 10-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


### నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

మాటలోన జూడ మర్యాదతోడను
వినుటలోన చూపు వినయమున్న
సరిగనుండ వలయు సంస్కారమందునా
అడుగువేళ నెపుడు నంతప్రీతి

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


### విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# పోలింగ్ ప్రశాంతం

## వేరువేరు చోట్ల ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

- పుదుచ్చేరిలో 86శాతం..
- అసోంలో 84.42శాతం..
- కేరళలో 77.45శాతం
- అసోంలో ఘర్షణలు : 30మందికి గాయాలు, ఏడుగురు అరెస్టు
- అసోంలో పోలింగ్ బూత్‌లో వీడియో : ఎఫ్ఐఆర్ నమోదు

న్యూఢిల్లీ

కేరళం, అసోం రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో చెదురుమదురు ఘటనలు మినహా గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మూడు చోట్లా భారీ సంఖ్యలోనే పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలో 86శాతం, అసోంలో 84.42శాతం, కేరళలో 77.45శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అస్సాంలో సాయంత్రం ఐదు గంటలకే పోలింగ్ ముగిసినా, కేరళ, పుదుచ్చేరిల్లో మాత్రం -మిగతా 2 లో






### తుది ఒప్పందం వరకు
## ఇరాన్‌లోనే బలగాలు

- ఉల్లంఘనలు జరిగితే భారీ దాడులు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

న్యూఢిల్లీ,

కాల్పుల విరమణపై తుది ఒప్పందం కుదిరి అది పూర్తిగా అమలు జరిగే వరకు ఇరాన్ లోపల, చుట్టూ అమెరికా సైనిక బలగాల మోహరింపు కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. పశ్చిమాసియాలో కాల్పుల విరమణ పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్న నేపథ్యంలో ఇరాన్‌పై ఒత్తిడిని కొనసాగించాలని ట్రంప్ భావిస్తున్నట్లు ఈ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఇప్పటికే గణనీయంగా బలహీనపడిన శత్రువును ఎదుర్కొనడానికి, నాశనం చేయడానికి అవసరమైన అదనపు మందుగుండు సామగ్రి, ఆయుధాలు, అన్ని అమెరికా నౌకలు, విమానాలు, సైనిక సిబ్బంది ఒప్పందం కుదిరి, పూర్తిగా అమలయ్యే వరకు ఇరాన్‌లోపల, దాని పరిసర ప్రాంతాలలోనే ఉంటాయి అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ తెలిపారు.అవగాహన ఉల్లంఘన తీవ్ర సైనిక ప్రతిస్పందనకు దారితీయగలదని ఆయన హెచ్చరించారు. ఏ కారణం చేతనైనా దీన్ని పాటించకపోతే అప్పుడు కాల్పులు మొదలవుతాయని, మునుపెన్నడూ ఎవరూ చూడనంత శక్తివంతమైనవిగా ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు. అమెరికా కీలక లక్ష్యాలను పునరుద్ఘాటిస్తూ ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదని, హెర్ముజ్ జలసంధి తెరిచి, సురక్షితంగా ఉండాలని ఆయన తెలిపారు.

## బెంగాల్ మార్పు కోరుకుంటోంది..



- రాష్ట్రం అంతటా నందిగ్రామ్ ఫలితాలే
- భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోంది
- బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తాం
- తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవు
- తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తాం

2

## దీదీ ఆస్తులు అంతంత మాత్రమే



- చిర,చరాస్తులు కూడా లేవు
- సొంత ఇల్లు అంతకన్నా లేదు
- బ్యాంకులో కేవలం రూ.12.4లక్షల నగదు నిల్వ

2




### ఈడెన్‌లో ముకుల్
## చౌదరి సునామీ..!

- ఐపీఎల్‌లో కొత్త హీరో ఆవిర్భావం
- లక్నోను గెలిపించిన ముకుల్ చౌదరి
- కేకేఆర్‌పై బ్యాటింగ్‌లో విధ్వంసం

న్యూఢిల్లీ,

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు సంచలన విజయం సాధించింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచులో చివరి బంతికి విజయం సాధించింది. ఓ దశలో 182 పరుగుల లక్ష్య ఛేదనలో ఓటమి అంచున నిలిచిన ఆ జట్టు.. 21 ఏళ్ల ముకుల్ చౌదరి అసాధారణ బ్యాటింగ్‌తో గెలుపుగీతను దాటింది. దీంతో ఈ టోర్నీలో రెండో విజయాన్ని నమోదు చేసింది. మరోవైపు కేకేఆర్ నాలుగు మ్యాచులు ఆడినా.. ఒక్క విజయం కూడా సాధించలేకపోయింది. 182 పరుగుల ఛేజింగ్‌తో బరిలోకి -మిగతా 2 లో

## రాఘవ్ చద్దా కొత్త పార్టీ?!



న్యూఢిల్లీ :

ఆమ్ ఆద్మీ పార్టీ పక్కకు పెట్టిన ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా కొత్త రాజకీయ పార్టీని స్థాపించే సూచనలు కనిపిస్తున్నాయి! ‘ఆసక్తికర ఆలోచన’ పేరిట సామాజిక మాధ్యమాల్లో ఆయన షేర్ చేసిన వీడియో ప్రకారం వేరే పార్టీలో చేరే దాని కన్నా కొత్త పార్టీని స్థాపించడమే మేలన్న అభిప్రాయాన్ని ఆయన పంచుకున్నారు.సొంత పార్టీతో విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన ఈ విషయాన్ని పంచుకోవడం గమనార్హం. చద్దా తనకున్న ప్రజా మద్దతును నిలబెట్టుకోవాలంటే కొత్త పార్టీని పెట్టడమే మేలన్న ఓ కంటెంట్ క్రియేటర్ వీడియోను ఆయన తన ఖాతాలో పంచుకున్నారు.

## రేవంత్ కన్నా... కేసీఆర్ పాలనే
# బెటర్



### తెలంగాణ ఏర్పాటు కెసిఆర్ వల్లనే సాకారమయ్యింది

- నష్టపోయిన ప్రతి రైతును ఆదుకున్న కెసిఆర్
- జాయతీయ స్థాయిలో బిజెపి..రాష్ట్రంలో కెసిఆర్ బెటర్
- కాంగ్రెస్ పాలన చూశాక బిఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు
- మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన

జగిత్యాల

రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు-మిగతా 2 లో



## కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టండి

- మూడు బ్యారేజీలను వినియోగంలోకి తేవాలి
- పనుల పర్యవేక్షణకు మేడిగడ్డ వద్ద బేస్ క్యాంప్ ఏర్పాటు :
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

కాళేశ్వరంలోని మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సమీక్ష నిర్వహించారు. -మిగతా 2 లో




### రిలయన్స్ రిటైల్
## వాల్యుయేషన్ భళా

- జనవరి నాటికి రూ.9.26 లక్షల కోట్లు
- హెక్టాకార్న్ జాబితాలో ఏడో స్థానం
- స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేషన్ స్కూల్ ఆఫ్ బిజినెస్

న్యూఢిల్లీ

ముకేశ్ అంబానీ కుమార్తె ఇషా అంబానీ నాయకత్వంలోని ‘రిలయన్స్ రిటైల్’ మరో రికార్డు సృష్టించింది. ఈ ఏడాది జనవరి నాటికి అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం కంపెనీ విలువ (వాల్యుయేషన్) 10,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.9.26 లక్షల కోట్లు) దాటింది. దీంతో స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఈ కంపెనీని విలువపరంగా ప్రపంచంలోని ఏడో అతి పెద్ద ప్రైవేటు స్టార్టప్ కంపెనీగా ప్రకటించింది. ఏదైనా ప్రైవేటు స్టార్టప్ కంపెనీ మార్కెట్ విలువ 10,000 కోట్ల డాలర్లు దాటితే దాన్ని హెక్టాకార్న్ లేదా సూపర్ స్టార్టప్ అంటారు. మన దేశం నుంచి రిలయన్స్ రిటైల్ ఒక్కటే ఈ జాబితాలో చోటు సంపాదించింది. ప్రపంచంలో మరే ప్రైవేటు రిటైల్ స్టార్టప్ కూడా ఈ స్థాయిలో లేదని ఎస్‌జీసీబీ తెలిపింది. అగ్రస్థానంలో ‘ఓపెన్ ఏఐ’: ఈ తాజా జాబితాలో ఓపెన్ ఏఐ, ఆంథ్రోపిక్, ఇలాన్ మస్క్ నిర్వహణలోని స్పేస్ ఎక్స్ కంపెనీలు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ 100 ప్రైవేట్ స్టార్టప్ కంపెనీలతో

-మిగతా 2 లో

## భారత జీడీపీ 6.6 శాతానికి తగ్గొచ్చు

- ప్రపంచ బ్యాంక్ రిపోర్ట్




2

## పొంగులేటి కాదు..పొంగులూటీ

- బాంబులు పేలుతాయన్న బాంబులేటి
- అవినీతిని దాచిపెట్టేందుకు నానా తంటాలు
- క్రషర్‌లో జరిగిన అవినీతిని సిఎం స్వయంగా చెప్పారు
- నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివైతే ..హైడ్రా ఎందుకు వెళ్లలేదు
- గొల్లపల్లి రిజర్వాయర్ వ్యతిరేక రైతులకు హరీష్ సంఘీభావం



వనపర్తి,

పొంగులేటి కాదు ఆయన బాంబులేటి.. పొగరులేటి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పవిత్రమైన అంబేద్కర్ సచివాలయంలో పొగరులేటి మాటలు.. నిజాలు దాచి అబద్దాలు మాట్లాడారని ఆగ్రహించారు. ఆయన మాటలు వింటే.. ఆయన ఎంత డిఫెన్స్‌లో ఉన్నారో అర్ధమవుతోందని అన్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఇదివరకు బాంబులు -మిగతా 2 లో

### జూన్ 2నుంచి స్కూల్
## విద్యార్థులకు అల్పాహారం

- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం
- డిప్యూటి సిఎం భట్టి విక్రామర్క వెల్లడి



ఖమ్మం

కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. -మిగతా 2 లో

## ఈడెన్‌లో ముకుల్ చౌదరి సునామీ..!

మొదటి తరువాయి

దిగిన లక్నో సూపర్ జెయింట్స్.. ఆదిలోనే వికెట్లు కోల్పోయింది. మిచెల్ మార్ష్ (15), ఎయిడెన్ మార్‌క్రమ్ (22), రిషభ్ పంత్ (10) స్వల్ప స్కోరుకే ఔట్ అయ్యారు. ఓ దశలో 128 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన లక్నో.. విజయావకాశాలు సంక్లిష్టం చేసుకుంది. ఇలాంటి సమయంలోనే ముకుల్ చౌదరి అద్భుతం చేశాడు. అసాధారణ హిట్టింగ్‌తో కేకేఆర్‌కు మ్యాచును దూరం చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో27 బంతులు ఎదుర్కొన్న ఈ 21 ఏళ్ల ప్లేయర్.. ఏకంగా ఏడు సిక్సర్లు బాదాడు. రెండు ఫోర్లు కూడా కొట్టాడు. దీంతో 200ల స్ట్రైక్ రేటుతో 54 రన్స్ చేసి.. జట్టును గెలిపించాడు. లక్నో విజయానికి చివరి 2 ఓవర్‌లలో 30 రన్స్ అవసరమయ్యాయి. ఈ సమయంలో కామెరూన్ గ్రీన్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో ముకుల్ 16 రన్స్ రాబట్టాడు. చివరి ఓవర్ తొలి బంతికి ఆవేశ్ ఖాన్.. సింగిల్ తీశాడు. దీంతో స్ట్రైకింగ్‌లోకి వచ్చిన అతడు రెండో బంతిని స్టాండ్స్‌లోకి పంపించాడు. ఐదో బంతికి సైతం అదే శిక్ష వేశాడు. చివరి బంతికి ఒక్క పరుగు అవసరం కాగా.. బ్యాటుకు బంతి తాకకపోయినా ఇద్దరు బ్యాటర్లూ పరుగు పూర్తి చేశారు. దీంతో లక్నో టీమ్ సంబురాల్లో మునిగితేలింది. 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. కేకేఆర్ బ్యాటర్లలో ఎ.రఘువంశీ (33 బంతుల్లో 45 రన్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

## దీదీ ఆస్తులు అంతంత మాత్రమే

-చిర,చరాస్థులు కూడా లేవు
-సొంత ఇల్లు అంతకన్నా లేదు
-బ్యాకులో కేవలం రూ.12.4లక్షల నగదు నిల్వ



కోల్‌కతా,
మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ ముఖ్యమంత్రిగా దాదాపు పదిహేనేళ్లుగా కొనసాగుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఆమెను అందరూ 'దీదీ' అని పిలుస్తారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నప్పటికీ, ఆమె గడుపుతున్న నిరాడంబర జీవితం నేటి తరం రాజకీయ నాయకులకు ఒక ఆదర్శంగా నిలుస్తోందని అంటున్నారు. ఇప్పటికీ తన పేరిట ఒక సొంత ఇల్లు, భూమి లేవని ఆమె వెల్లడించడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. త్వరలో జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భవానీ పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మమత బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసే సమయంలో కూడా ఆమె ఎప్పటిలాగే తన ట్రేడ్‌మార్క్ కాటన్ చీర, హవాయి చెప్పులతో ఎంతో సాదాసీదాగా కనిపించడం అందరినీ ఆకట్టుకుంది.మమతా బెనర్జీ అఫిడవిట్‌లో సమర్పించిన ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. ఇండియన్ బ్యాంక్‌లో దీదీ పర్సనల్ ఖాతాలో సుమారు రూ.12.4లక్షలు ఉన్నాయి. ఎన్నికల ఖర్చుల కోసం అదే బ్యాంక్‌లో ఉన్న మరో ఖాతాలో రూ.40,000 ఉన్నాయి. అంటే మొత్తం బ్యాంకు నిల్వలు సుమారు రూ.13 లక్షలు. చేతిలో రూ.75,000 నగదు ఉన్నట్లు మమతా బెనర్జీ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీదీ వద్ద కేవలం 9.75గ్రాముల బంగారు ఆభరణాలు మాత్రమే ఉన్నాయి. 2021లో దాని విలువ రూ.88,887 ఉండగా, ప్రస్తుతం బంగారం రేటు పెరగడంతో రూ.1.75లక్షలకు పెరిగింది. మమత బెనర్జీకి సొంత ఇల్లు లేదు. ఎక్కడ వ్యవసాయ భూమి కానీ, నివాస స్థలాలు కానీ లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కనీసం వ్యక్తిగత వాహనం కూడా లేదని ఆమె తన అఫిడవిట్‌లో తెలిపారు.

## కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టండి

మొదటి తరువాయి

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. మరమ్మతులకు సంబంధించిన ఏజెన్సీలన్నింటినీ భాగస్వామ్యం చేయాలని సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టేషన్లతో టీమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పనిలో సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజీని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తవ్వాల్సి ఉందనీ, ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఇందుకు కావాల్సిన యంత్రాలను సమకూర్చుకుని వీలైనంత త్వరగా పని పూర్తి చేయాలన్నారు. డిసెంబరు వరకు చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగడానికి వీలు లేదన్న ముఖ్యమంత్రి నిధుల విషయంలో ఇబ్బంది కల్గనివ్వమని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు ప్రారంభం అయ్యాక తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, సీఎం కార్యదర్శి మానిక్ రాజ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రిలయన్స్ రిటైల్ వాల్యుయేషన్ భళా

మొదటి తరువాయి

రూపొందించిన జాబితాలో ఈ మూడు కంపెనీల వాల్యుయేషనే మూడో వంతు వరకు ఉంది. ఇక మన దేశానికి చెందిన ఎన్ఎసఈ (2,400 కోట్ల డాలర్లు), టాటా ఈవీ మొబిలిటీ (900 కోట్ల డాలర్లు) 27, 93వ స్థానాల్లో నిలిచాయి.

## భారత జీడీపీ 6.6 శాతానికి తగ్గొచ్చు

ప్రపంచ బ్యాంక్ రిపోర్ట్




న్యూఢిల్లీ :
పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా ఇంధన సెగను పెంచుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 90 నుంచి 100 డాలర్ల మధ్య ఊగిసలాడటం భారత్‌కు అతిపెద్ద సవాలుగా మారిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. చమురు ధరలు పెరిగితే దేశీయంగా రవాణా భారమై, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని.. దీనివల్ల వృద్ధి రేటుపై ఒత్తిడి పడి 2026-27 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 6.6 శాతానికి నెమ్మదించవచ్చని ప్రపంచ బ్యాంక్ హెచ్చరించింది. వాణిజ్యపరంగా చూస్తే ప్రపంచవ్యాప్తంగా ఎగుమతులపై విధిస్తున్న భారీ టారిఫ్‌లు భారత ఎగుమతిదారులకు ప్రతిబంధకంగా మారాయి.
పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం వల్ల అంతర్జాతీయ వాణిజ్య మార్గాల్లో అస్థిరత ఏర్పడి, సరఫరా గొలుసు దెబ్బతినే అవకాశం ఉంది. ఇది ఎగుమతులపై ఆధారపడిన రంగాలను దెబ్బతీస్తూనే దిగుమతి చేసుకునే ముడి సరుకుల ఖర్చును పెంచి తయారీ రంగాన్ని ప్రతికూలతల్లోకి నెట్టే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి భారత్ వద్ద పటిష్టమైన విదేశీ మారక నిల్వలు, ఆర్థిక వెసులుబాటు ఉన్నప్పటికీ సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే ఈ బఫర్స్ కరిగిపోయే ముప్పు పొంచి ఉంది.

# పోలింగ్ ప్రశాంతం

మొదటి తరువాయి

ఆరుగంటల వరకు అనుమతించారు. ఆ సమయానికి క్యూలో వున్న వారికి టోకెన్లు ఇచ్చి ఓటు వేసేందుకు అనుమతిచ్చారు.

**కేరళలో**

కేరళలోని 140 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ సాఫీగా, సజావుగా సాగింది. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 76శాతం పోలింగ్ నమోదు కాగా, ప్రస్తుత ఎన్నికల్లో అంతకంటే అధికంగానే నమోదైంది. ఈసారి కోయకోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల కమిషన్ పేర్కొంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, పలువురు మంత్రులు, నటులు సహా పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలో జెన్‌జీ పోలింగ్ బూత్ అందరినీ ఆకట్టుకుంది. తొలిసారి ఓటు వేసిన వారు సెల్ఫీ దిగేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. కాగా తొలిసారి ఓటు వేసిన వారందరికీ ఎన్నికల కమిషన్ 'స్వీట్ సర్‌ప్రైజ్' ఇచ్చింది. ప్రతి జిల్లాలో మొదటసారి ఓటు వేసిన 200మందికి హల్వా పంచింది.

ఎన్నికల అధికారి మృతి

అసోంలోని సోనిత్‌పూర్ జిల్లాలో ఎన్నికల అధికారి దేబెన్ హోరో (45) మరణించి వుండగా కనుగొన్నారు. ఆయన మరణానికి కారణమేంటో ఇంకా నిర్ధారించలేదు. నాడార్ నియోజకవర్గంలో రెండో పోలింగ్ అధికారిగా ఆయనను నియమించారు. గురువారం ఉదయం ఆయన మంచంపై స్పృహ లేకుండా పడి వుండగా చూశారు. వెంటనే అంబులెన్సులో ఆస్పత్రికి తీసుకెళ్ళినా ఫలితం లేకపోయింది. ఆయన మరణించారని అధికారులు తెలిపారు.

పోలింగ్‌బూత్‌లో వీడియో : ఎఫ్‌ఐఆర్ నమోదు

పోలింగ్ బూత్‌ల్లో ఫోన్లు నిషిద్ధం. కేంద్రంలోకి వెళ్ళేముందు ఫోన్లు, బ్యాగ్‌లు సహా అన్ని వస్తువులను ఇచ్చి లోపలకు వెళ్లాలని ఈసీ కూడా స్పష్టంగా పేర్కొంది. కానీ అస్సాంలోని కర్బి అనగ్లాంగ్ జిల్లా యంత్రాంగం గురువారం ఇందుకు సంబంధించి ఫోలీసు ఫిర్యాదు చేసింది. ఒక పోలింగ్ స్టేషన్‌లో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను చూపిస్తునట్లుగా వున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిందని అధికారులు తెలిపారు. దిఫూ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్‌లో తీసిన వీడియోగా భావిస్తున్నారు. వెంటనే దీనిపై విచారణకు ఆదేశించామని చెప్పారు. ప్రజా ప్రాతినిధ్యచట్టంలోని పలు సెక్షన్ల కింద ఎఫ్‌ఐఆర్‌ను కూడా నమోదు చేశారు.

పుదుచ్చేరిలో


పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాల్లోనూ భారీగా పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలో ఇంత భారీ స్థాయిలో (86శాతం) ఓటింగ్ నమోదవడం 2006 తర్వాత ఇదే తొలిసారి. వీవీప్యాట్ యంత్రంలోని బ్యాటరీ నుంచి పొగ వస్తుండడంతో కరైకల్‌లో ఒక పోలింగ్ బూత్‌లో కాసేపు పోలింగ్ ఆగింది. ఆ బ్యాటరీని మార్చి కొత్తది పెట్టిన తర్వాత పోలింగ్‌ను పునరుద్ధరించారు.

వామపక్ష సంఘటనకు మళ్ళీ అధికారం

రాష్ట్రంలో వామపక్ష సంఘటన తిరిగి అధికారంలోకి వస్తుందని సీపీఐ కేరళం రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం పేర్కొన్నారు. వట్టియురకవులో తన ఓటు హక్కు వినియోగిం చుకున్న తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను స్పష్టంగా అర్థం చేసుకున్న ప్రజలు తమ నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, దేశ సార్వభౌమాధికారం వంటి కీలకమైన స్తంభాలు దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి ఆందోళనలే ఓటర్ల అభిప్రాయాలను ప్రభావితం చేస్తున్నాయన్నారు. దేశంలో, అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ అనిశ్చితులను ప్రస్తావిస్తూ, యుద్ధ మేఘాల నడుమే ప్రజలు ఓటు వేసారన్నారు. వామపక్షాలే విశ్వసనీయమైన ప్రత్యామ్నాయమని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఇచ్చే శుష్క వాగ్దానాలు కాకుండా నిరుపేదలకు ఆశ, భద్రత కల్పించేది వామపక్షాలేనని అన్నారు.

# బెంగాల్ మార్పు కోరుకుంటోంది.

- రాష్ట్రం అంతటా నందిగ్రామ్ ఫలితాలే
- భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోంది
- బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తాం
- తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవు
- తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తాం



న్యూఢిల్లీ,
పశ్చిమబెంగాల్ లోని హల్దియాలో ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తృణమూల్ కాంగ్రెస్ ( పార్టీపై విమర్శలు గుప్పించారు. ఐదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో సీఎం మమతాబెనర్జి ఓటమిని గుర్తుచేస్తూ.. ఈసారి పశ్చిమబెంగాల్ రాష్ట్రం అంతటా అదే ఫలితం పునరావృతమవుతుందని చెప్పారు. పశ్చిమబెంగాల్ మార్పును కోరుకుంటోందని, ఈ క్రమంలో బీజేపీ భారీ విజయాన్ని చూస్తామని వ్యాఖ్యానించారు.నందిగ్రామ్‌లో ఐదేళ్ల క్రితం ఏం జరిగిందో ఇప్పుడు భవానీపూర్‌తోపాటు మొత్తం బెంగాల్‌లోనూ అదే ఫలితం వస్తుందని ప్రధాని జోష్యం చెప్పారు. ఇవి సాధారణ ఎన్నికలు కావని, ఈ ఎన్నికలు అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోందని విమర్శించారు. ప్రైవేటు సెక్టార్లలో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తామని, బెంగాల్ యువతకు వ్యతిరేకంగా తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవని మోదీ వ్యాఖ్యానించారు. ఒక్కసారి డబుల్-ఇంజిన్ సర్కార్ అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ ఇక్కడ అమల్లోకి వస్తాయని చెప్పారు. బెంగాల్ ప్రజలకు ఆరు హామీలు ఇస్తున్నానని అన్నారు. అన్యాయానికి గురైన ఆడబిడ్డల కేసులను తిరగదోడుతామని, అవినీతికి సాయం చేస్తున్న చట్టాలను రూపుమాపుతామని తెలిపారు. తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని ప్రధాని అన్నారు. శరణార్థులకు రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక హక్కులను కల్పిస్తామని, చొరబాటుదారులను మాత్రం దేశం నుంచి తరిమికొడతామని చెప్పారు. ఒక్కసారి బీజేపీ అధికారంలోకి రాగానే 7వ వేతన కమిషన్‌ను అమల్లోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

# రేవంత్ కన్నా...కేసీఆర్ పాలనే బెటర్

మొదటి తరువాయి

భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని.. రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే 13న జగిత్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని సమాచారం. కేటీఆర్ జగిత్యాలలో జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించనున్నారు. జీవన్ రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా, మంత్రిగా పని చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బయల్దేరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలవనున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలకున్నాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి రానున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది. కాగా, కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సైతం జీవన్‌రెడ్డి ఇంటికి రానున్నారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించిన అనంతరం ఆయనను పార్టీలోకి లాంఛనంగా కేటీఆర్ ఆహ్వానించనునున్నారు. 1984లో కాంగ్రెస్ పార్టీలో చేరిన జీవన్‌రెడ్డి నలభై మూడేండ్లుగా ఉత్తర తెలంగాణలోనే కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన జీవన్‌రెడ్డి 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచి శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకోవడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవన్‌రెడ్డి వర్గానికి ప్రాధాన్యత తగ్గిపోవడం, నామినేటెడ్ పదవుల కోసం ప్రతిపాదించిన వారికి పదవులను ఇవ్వకుండా ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులకు ఇవ్వడం, ప్రధాన
అనుచరుల్లో ఒకరు దారుణహత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల, రాయికల్ పట్టణాల్లో జీవన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిని కాంగ్రెస్ పక్కన పెట్టడంతో తీవ్ర ఆవేదనకు లోనైన జీవన్‌రెడ్డి గత నెల 25న కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

## పొంగులేటి కాదు..పొంగులూటీ

మొదటి తరువాయి

పడతాయని చెప్పి ఏడాది దాటిందని.. అవి తుస్సుమన్నాయని సెటైర్లు గుప్పించారు. ఆయనలో సరుకు లేనందునే తిట్ల దండకం అందుకున్నారని ధ్వజమెత్తారు. పిట్ట కథలు.. తిట్లు.. ఆయన ఆయాసం.. అన్నీ చూశామని విమర్శించారు. ఆయనతో పాటు సహచర మంత్రుల అవినీతి చిట్టా కూడా చదివారని ఎద్దేవా చేశారు. గురువారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌లో హరీశ్‌రావు పర్యటించారు. గొల్లపల్లి రిజర్వాయర్ వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, మల్లు భట్టి విక్రమార్క, సీఎం సోదరుల అవినీతి బాగోతాన్ని పొంగులేటినే బయట పెట్టారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆయన పొంగులేటి కాదు పొంగులూటీ అని వ్యగ్యంగా మాట్లాడారు. ఆయన క్రషర్‌లో జరిగిన అవినీతిని సీఎం రేవంత్‌రెడ్డినే స్వయంగా బయటపెట్టారని ఆరోపించారు. ప్రతిపక్షం కాదని.. తామే అన్ని విషయాలు వెలుగులోకి తెస్తామని అసెంబ్లీలోనే సీఎం చెప్పారని అన్నారు. సీఎం ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు వెళ్లి.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అనుమతులు లేవని నివేదిక ఇచ్చారని ప్రస్తావించారు. మరి అధికారులు, సీఎం చెప్పింది తప్పా.. పొంగులేటి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు.. ఇదంతా మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నమని ఆరోపించారు. తాము ఈ విషయాన్ని లేవనెత్తిన తర్వాతనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన కంటైనర్‌పై రంగు వేసి, కాంగ్రెస్ జెండా తీసేశారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నాదర్‌గుల్ భూములను 22 ఏ లో పెట్టి రక్షించామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ భూములను ఎందుకు దాస్తున్నారని.. వీటి గురించి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇవి ప్రభుత్వ భూములని ఆర్డీఓ కోర్టులో చెప్పారని.. మరి ఎందుకు అక్కడి భూమిలో రోజుకోక కొత్త బోర్డు వెలుస్తోందని నిలదీశారు. ఇవి ప్రభుత్వ భూములు అయితే ఆక్రమణదారులపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని అడిగారు. రెవెన్యూ మంత్రిగా పొంగులేటి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.

## జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

మొదటి తరువాయి

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు.
అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకువచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశం



**దేవరకొండ ఏప్రిల్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని దేవరకొండ తహసీల్దార్ కార్యాలయంలో ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. 2026 ఏప్రిల్ 14న నిర్వహించబోయే నియోజకవర్గ స్థాయి జయంతి వేడుకల ఏర్పాట్లపై తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన ఈ సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కరుణశ్రీ, సీఐ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ జయంతి వేడుకలను నియోజకవర్గస్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ శాఖ పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ దళిత , ప్రజా సంఘాలు మరియు సంఘాల నాయకులు పాల్గొని వేడుకల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలో ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు నాగరాజు, పుల్యా, పరంజ్యోతి, దిలీప్, పవన్ పాల్గొని విద్యార్థి వసతి గృహాల్లో నిర్వహించబోయే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సమీక్షా సమావేశంలో బహుజన మేధావి డాక్టర్ యేకుల రాజారావు, దేవయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు యేకుల సురేష్, అంకురి శివ, మద్దిమడుగు భిక్షపతి, కంబాల పల్లి వెంకటయ్య, ప్రసాద్, ఎర్ర అంజనేలు , పీటర్, లక్ష్మయ్య మరియు మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలల రేషన్ బియ్యం సద్వినియోగం చేసుకోండి

-- జగదీశ్ గౌడ్



**మంచాల,ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్, మే, జూన్ నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి అందజేయాలని నిర్ణయించింది. బీజేపీ నాయకుడు జగదీశ్ గౌడ్ మాట్లాడుతూ, వేసవికాలంలో ప్రజలు రేషన్ కోసం ప్రతినెల వెళ్లి ఇబ్బందులు పడకుండా ముందుగానే మూడు నెలల సరుకులు ఒకేసారి ఇవ్వడం పేదల పక్షాన తీసుకున్న గొప్ప నిర్ణయమని తెలిపారు. లబ్ధిదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీకి లోయపల్లి గ్రామ బీజేపీ శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఉపాధి హామీ జాబ్ కార్డుల తొలగింపు ఆలోచనలు ఉపసంహరించుకోవాలి

- కంబాలపల్లి ఆనంద్



**దేవరకొండ, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉపాధి హామీ జాబ్ కార్డులను ఈకేవైసి పేరుతో తొలగించే ఆలోచనలను ఉపసంహరించుకోవాలని, పని ప్రదేశంలో రెండు పూటల ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. తాటి కోల్ గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన ఉపాధి హామీ మెట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు 170 మంది కూలీల జాబ్ కార్డులు రద్దు చేసి పనికి దూరం చేయడం వల్ల ఆర్థిక నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోటోలు మ్యాచ్ కాకపోవడం వల్ల వేతనాలు రాకుండా పోతున్నాయని తెలిపారు. కొత్తగా కార్డు కోసం అప్లై చేసినా ఇవ్వడం లేదని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టం పేదల పొట్ట కొట్టేలా ఉందని విమర్శించారు. పాత విధానాన్ని కొనసాగించి, కొత్త జాబ్ కార్డులు ఇచ్చి అందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ మెట్ల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు జగదీష్, బొడ్డు హేమావతి, సారశోభా, గౌని బాలమణి, డి. జ్యోతి, రామచంద్రం, అనిత, ఆంజనేయులు, హమద్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ గురుకులలో సి.ఇ.సి. గ్రూప్ కొనసాగాలి



**దేవరకొండ, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల, కొండమల్లేపల్లి బాలికల గురుకుల పాఠశాల నుండి సి.ఇ.సి. గ్రూపును వేరే పాఠశాలకు మార్చకూడదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 83 గురుకుల పాఠశాలల్లో సి.ఇ.సి. గ్రూపును తొలగించడం పేద విద్యార్థులకు నష్టం కలిగిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మానసిక ఇబ్బందులకు గురికాకుండా, అన్ని గ్రూపులను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, పిరికేటి శ్రీనివాస్ చారి, పున్న భిక్షమయ్య, యాదయ్య చారి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ జాతర




**ఆళ్లగడ్డ ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం గ్రామంలో ఈనెల 20 21 తేదీలలో పెద్దమ్మ జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు పెద్దమ్మ జాతర ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని నిర్వాహకులు కోరారు

## అంగన్వాడీ టీచర్లకు 5జి స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే




**దేవరకొండ, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ నియోజకవర్గంలోని చింతపల్లి మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్లకు 5జి స్మార్ట్‌ఫోన్లను ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఫోన్లను అందజేస్తోందని తెలిపారు. పోషణ ట్రాకర్, బాల సంజీవిని యాప్‌ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య వివరాలు డిజిటల్‌గా నమోదు అవుతాయని, దీని ద్వారా పనితీరులో నాణ్యత పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## సేవే లక్ష్యం... 20 ఏళ్లుగా చలివేంద్రం



**షాద్‌నగర్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఊరట కలిగించేందుకు కళాబంధు బండారి రమేష్ నిర్వహించిన చలివేంద్రం, అంబలి కేంద్రం పోలీస్ స్టేషన్ ముందు ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి చైర్మన్ అగ్గనూరు బస్వం, కౌన్సిలర్లు పెంటయ్య, ముబారక్ ఆలీ హాజరై ప్రారంభించారు. గత 20 ఏళ్లుగా నిరంతరంగా చలివేంద్రాలు నిర్వహిస్తూ ప్రజల దాహాన్ని తీర్చుతున్న రమేష్ సేవా స్ఫూర్తి విశేష ఆదరణ పొందుతోంది. పేదలు, కార్మికులు, ప్రయాణికులకు వేసవిలో ఈ సేవ ఉపశమనం కలిగిస్తోందని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రశంసించారు. కార్యక్రమంలో గుర్రం రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లయన్ సుధాకర్, నాగిళ్ళ గోపాల్ గుప్తా, పానుగంటి శశిధర్, గడ్డం వెంకటేష్, డా. రాచయ్య, సత్యనారాయణ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డ దుండగులు



**మేడిపల్లి, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలు పెరుగుతున్నాయి. తాజాగా బోడుప్పల్లోని ఎన్ఐఎన్ కాలనీకి చెందిన పెండ్యాల గీత (49) ఇంటిలో దొంగలు తాళాలు పగలగొట్టి బంగారం, వెండి వస్తువులు అపహరించారు. మార్చి 30న కుటుంబంతో కలిసి మధురైలో భర్త వద్దకు వెళ్లిన గీత, బుధవారం తిరిగి ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం ధ్వంసమై, బీరువాలో దాచిన 10 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి వస్తువులు కనబడలేదని తెలిపారు. ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ధర్నా




**మంచాల, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంచాల మండల అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో రైతులకు కరెంట్ లోవోల్టేజ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరెంట్ ఆఫీస్ ముట్టడి చేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ముందు రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు రైతు కన్నీటి కారణమవుతోందని విమర్శించారు. రుణమాఫీ, రైతు భరోసా, పంటలకు మద్దతు ధర ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రైతుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని ఏడీ, ఏఈ అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వింజమూరి వెంకట రెడ్డి, జిల్లా నాయకులు దాన్నే బాషాయ్య, మరగోని శ్రీశైలం, పాండాల జంగయ్య, చివురల పాండు, మండల ప్రధాన కార్యదర్శి వెదిరే జగదీశ్వర్ రెడ్డి, కారింగు రాజు గౌడ్, సర్పంచ్ జోగు శంకరయ్య, ఉపసర్పంచులు, బూత్ అధ్యక్షులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఉత్తమ యూపీహెచ్‌సీ అవార్డు అందుకున్న మర్రిగూడ హాస్పిటల్



**మర్రిగూడ, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ యూపీహెచ్‌సీగా గుర్తింపు పొందిన మర్రిగూడ ప్రభుత్వ హాస్పిటల్ డాక్టర్లను గ్రామ సర్పంచ్ వీరమళ్ళ శిరీషలోకేష్ గౌడ్ సన్మానించారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రివర్యుల చేతుల మీదుగా అవార్డు అందుకున్న డాక్టర్లు శాలిని, దీపక్ గారిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఈ అవార్డు డాక్టర్లు మరియు సిబ్బంది కృషి ఫలితమని అభినందించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ నాయక్, వార్డు సభ్యులు యండి జమీర్, మహేశ్వరం యాదమ్మ రమేష్, నల్ల చంద్రశేఖర్ గౌడ్, కొండాపురం నరేష్ పాల్గొన్నారు.

## నవవధువు ఆత్మహత్య

**అలగడ్డ ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని శిరివెళ్ల మండలం గోవిందపల్లె జగనన్న కాలనీలో వివాహిత వడ్డే అఖిల (20)బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు నెల క్రితమే వివాహమైంది. ఈరోజు పుట్టింటి నుంచి వచ్చిన అనంతరం ఈ ఘటనకు పాల్పడింది. ఘటనా స్థలానికి సీఐ రాము చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## ఇందిరమ్మ ఇండ్లను సందర్శించిన వెల్దండ ఎంపీడీవో



**వెల్దండ, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలంలో ఉపాధి హామీ పనులు, నర్సరీ నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో గురువారం పరిశీలించారు. పెద్ద గ్రామం కావడంతో ఎక్కువ సంఖ్యలో కూలీలకు వసతులు కల్పించాలని పంచాయతీ కార్యదర్శి, మేట్‌లకు సూచనలు చేశారు. అనంతరం కొత్త గ్రామంలో లబ్ధిదారులతో సమావేశమై, ఇంటి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇండ్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామ నర్సరీలో ఎక్కువ మందిని పనిలో పెట్టాలని, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఓ ఈశ్వర్, కుమారి పల్లవి, ఏఈ హౌజింగ్, పంచాయతీ కార్యదర్శులు గిరి, భాస్కర్, మంజుల, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షునికి ఘన సన్మానం



**వంగూరు, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూరు మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిమ్ముల రాజశేఖర్ రెడ్డి గురువారం పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శాలువాలు కప్పి ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, మండల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మస్కతి బాదం మిల్క్‌లో ప్లాస్టిక్ ముక్క

### - వినియోగదారుడికి షాక్






**మహేశ్వరం, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



మహేశ్వరం పట్టణంలో మస్కతి కంపెనీ బాదం మిల్క్ బాటిల్‌లో ప్లాస్టిక్ ముక్క బయటపడటం కలకలం రేపింది. స్థానిక మొబైల్ షాప్ యజమాని ఆకుల శివకుమార్ బాదం మిల్క్ తాగుతుండగా బాటిల్‌లో గట్టి ప్లాస్టిక్ ముక్క బయటపడటంతో ఆశ్చర్యానికి గురయ్యాడు. వెంటనే సేల్స్‌మ్యాన్‌కు సమాచారం ఇవ్వగా, ఇది ప్యాకింగ్ లోపం కావచ్చని, ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. అయితే చిన్నపిల్లలు లేదా వృద్ధులు తాగినపుడు ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లోపాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నేనావత్ బాలు నాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి



**దేవరకొండ, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరుపుల లక్ష్మి--తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. లంబాడ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ, సామాజిక న్యాయం సాధించాలంటే బాలు నాయక్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం అత్యవసరమని ఆమె పేర్కొన్నారు. ఎంపీటీసీగా ప్రారంభించి, మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కీలక పాత్ర పోషించిన ఆయన, రెండుసార్లు ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించారని గుర్తు చేశారు. దేవరకొండలో రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించి గిరిజన ప్రాంతాల రూపురేఖలు మార్చిన అభివృద్ధి ప్రదాతగా బాలు నాయక్ నిలిచారని ఆమె ప్రశంసించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం, డిండి ఎత్తిపోతల పథకం, సింగరాజుపల్లి ఎత్తిపోతల, నక్కలగండి, అక్కంపల్లి రిజర్వాయర్లు పూర్తి చేయాలంటే ఆయనకు మంత్రి పదవి అవసరమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేజీబీవీ ప్రహరీ గోడకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**పదర, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పదర మండలంలోని రాయలగండి గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రహరీ గోడ, అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ. 38.15 లక్షల వ్యయంతో నిర్మాణం చేపడుతున్న ఈ పనులను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగు. పేదరికం కారణంగా వారు చదువు వదిలేయకుండా, మెరుగైన సమాజానికి పునాది వేయాలనే సంకల్పంతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు స్థాపించబడ్డాయి” అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మండుటి ఎండలో రేషన్ షాపుల వద్ద బారులు తీరిన జనం

**కరీంనగర్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్, మే, జూన్ నెలల సన్న బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో రేషన్ కార్డుదారులు పెద్ద సంఖ్యలో రేషన్ షాపుల వద్దకు తరలివచ్చారు. తీవ్ర ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజలు బారులు తీరడంతో రేషన్ షాపుల వద్ద కిక్కిరిసిన వాతావరణం నెలకొంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

## ఖర్గే వ్యాఖ్యలు ప్రజాస్వామ్యంపై దాడి

### -- నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎన్నికల సభలో చేసిన వ్యాఖ్యలను బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని హింసకు పిలుపునివ్వడం ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అని ఆయన పేర్కొన్నారు. ప్రజలను కలిపే బాధ్యత ఉన్న నాయకులు సమాజాన్ని విభజించేలా మాట్లాడటం దేశానికి ప్రమాదకరమని హెచ్చరించారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పటికీ పనిచేస్తాయని, ఇలాంటి వ్యాఖ్యలను ప్రజలందరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పల్ స్మశానవాటికలో గుర్తుతెలియని మృతదేహం



**ఉప్పల్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉప్పల్ బీరప్పగడ్డ స్మశానవాటికలో అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని పురుషుని మృతదేహం లభ్యమైంది. స్మశానవాటిక పరిసరాల్లో దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రాథమిక అంచనా ప్రకారం మృతుడు వయసు 30--35 సంవత్సరాలు ఉండవచ్చని, శవం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉందని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

## మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి



**నల్లగొండ, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. దొడ్డి కొమరయ్య భవనంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి నెల ?2500, విద్యార్థినులకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు, కళ్యాణలక్ష్మి పథకంలో 1 లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలని ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరుస్తున్నారని, 200 పని దినాలు, రోజుకు 600 కూలి ఇవ్వాలని కోరారు. బతుకమ్మ చీరల పంపిణీ సక్రమంగా జరగలేదని, ప్రతి మహిళకు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, జిట్టా సరోజ, ఎస్కే సుల్తానా, ఇందిరా, అరుణ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

## పహాడీషరీఫ్ పాత పోలీస్ స్టేషన్ పరిశీలన

**తుక్కుగూడ, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



శంషాబాద్ జోన్ డీసీపీ వార్షిక తనిఖీలలో భాగంగా పహాడీషరీఫ్ పాత పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాంగణం, పరిసరాలను సమగ్రంగా పరిశీలించి, భవనం చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని పరిరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవనం భద్రత, పరిశుభ్రత, సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచిస్తూ, భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని డీసీపీ స్పష్టం చేశారు.

## గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

**ఆళ్లగడ్డ ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆళ్లగడ్డ మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు వీణా నూర్జహాన్ తెలిపారు. తహసీల్దార్, వ్యవసాయ అధికారి, పశువైద్యాధికారి వంటి వివిధ శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామాల అభివృద్ధి పనులను వీరు పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సరళమ్మ పాల్గొన్నారు.



# కేసుల పరిష్కారంలో వేగం పెంచాలి

**-- డీసీపీ రాజేష్**



**మహేశ్వరం, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శంషాబాద్ జోన్ డీసీపీ బి. రాజేష్ వార్షిక తనిఖీల్లో భాగంగా పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు, ఆస్తి నేరాలు, ఘోర నేరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. ముఖ్యమైన కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని, సాక్ష్యాధారాల సేకరణలో నాణ్యతను మెరుగుపరచాలని అధికారులకు ఆదేశించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, పాత నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వాహనాల పనితీరు, డయల్-100 స్పందన, నైట్ పెట్రోలింగ్, బీట్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రజా స్నేహపూర్వక పోలీసింగ్‌కు ప్రాధాన్యతనిస్తూ, బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలని, విధుల నిర్వహణలో క్రమశిక్షణ, జవాబుదారీతనం పాటించాలని డీసీపీ రాజేష్ స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ బి. లక్ష్మీనారాయణ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు దయాకర్ రెడ్డి, లక్ష్మయ్య, ఫైసల్ అహ్మద్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజల డిమాండ్



**కరీంనగర్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ పట్టణంలోని తీగలగుంట్లపల్లి రైల్వే ట్రాక్‌పై నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు మందకొడిగా సాగుతున్నాయి. దీంతో కరీంనగర్--చొప్పదండి--ధర్మారం మార్గంలో ప్రయాణించే ప్రజలు రైళ్ల రాకపోకల కారణంగా గేటు మూసివేతతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో అంబులెన్సులు కూడా క్యూలైన్‌లో నిలిచిపోవడం వల్ల రోగులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. స్కూల్, కాలేజీ విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు ప్రతిరోజూ ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకుని ఫ్లైఓవర్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

## యువత రాంగ్ రూట్ డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదాలు



**కరీంనగర్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పట్టణంలోని కోతి, రాంపూర్, హైదరాబాద్ హైవే మార్గాల్లో కొంతమంది యువత యూ-టర్న్ తీసుకోకుండా రాంగ్ రూట్‌లో వెళ్తూ ఎదురుగా వస్తున్న వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ట్రాఫిక్ నియమాలను పట్టించుకోకుండా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. హెల్మెట్ ధరించకుండా రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వలన ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన కల్పించి, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసం ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయాలని వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు బీఎస్పీ శంఖారావం




**పెద్దపల్లి, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14న హనుమకొండలోని కేడీసీ గ్రౌండ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరగనుంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల రాజనరసయ్య ఈ విషయాన్ని వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో గోడ ప్రతులను ఆవిష్కరించిన అనంతరం జరిగిన సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ జోన్ ఇంచార్జి వరికిల్ల మల్లేష్ మాట్లాడుతూ, సభ విజయవంతం కావడానికి మూడు నియోజకవర్గాల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అంబేడ్కర్ వాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నార్ల గోపాల్ యాదవ్, సీనియర్ నాయకులు పెగ నరేష్, కాదాసి రవీందర్, మంథని నియోజకవర్గ ఇంచార్జి జనగామ రవికుమార్, పెద్దపల్లి నియోజకవర్గ కోశాధికారి మల్లారపు రవీందర్, రామగుండం నియోజకవర్గ ఇంచార్జి జింక ఉదయ్, అధ్యక్షులు జనగామ లింగయ్య, ఎల్ల స్వామి, కార్పొరేషన్ అధ్యక్షులు బివిఎఫ్ విష్ణు, నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ డిమాండ్




**హుస్నాబాద్ ,ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.2400 చెల్లిస్తామని ప్రకటించినా, రైతులు పంట అమ్ముకునే సమయంలో గోన సంచులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎల్కతుర్తిలో ఒక్క కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో భీమదేవరపల్లి రైతులు దూర ప్రయాణం చేసి మరింత కష్టాలు పడుతున్నారని అన్నారు. మార్కెట్ యార్డ్‌లో మొక్కజొన్నను డంప్ చేసి మళ్లీ నింపి కాంట వేయడం వంటి ప్రక్రియల్లో అదనపు ఖర్చులు రైతులకు భారమవుతున్నాయని పేర్కొన్నారు. గోన సంచులు అందక రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని, వారు క్వింటాకు కేవలం రూ.1700 మాత్రమే చెల్లిస్తున్నారని విమర్శించారు. దళారులకు గోన సంచులు ఎలా అందుతున్నాయో అనుమానాలు వ్యక్తం చేస్తూ, కొనుగోలు కేంద్రాల సిబ్బంది కుమ్మక్కై రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితుల వల్ల 100 క్వింటాళ్ల మొక్కజొన్న పండించే రైతు సుమారు రూ.70,000 వరకు నష్టపోతున్నారని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి రైతుల పొలాల వద్దకే గోన సంచులు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల భయంతో రైతులు పంట అమ్ముడయ్యే వరకు ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం న్యాయంగా వ్యవహరించకపోతే రైతులతో కలిసి రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు.

## ఘనంగా దామోదర్ రెడ్డి విగ్రహావిష్కరణ





**కరీంనగర్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుజూరాబాద్ మాజీ నాయకుడు ముద్దసాని దామోదర్ రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ శివారులోని సదాశివపల్లిలో కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరై జోహార్ దామన్న నినాదాలతో సభా ప్రాంగణం మారుమ్రోగింది. హుజూరాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్ మాట్లాడుతూ దామోదర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజా జీవితంలో పనిచేస్తామని తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో విగ్రహం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ దామోదర్ రెడ్డి ఉమ్మడి జిల్లాలోనే కాక రాష్ట్ర స్థాయిలోనూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, అనేక మంది నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎంఆర్వో కార్యాలయం సందర్శించిన ఆర్డీవో గంగయ్య



**ఎలిగేడు, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు ఎంఆర్వో కార్యాలయాన్ని గురువారం రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి, సాదా బైనామా దరఖాస్తుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను సత్వరమే ప్రారంభించాలని ఆదేశించారు. దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అమ్మిన పట్టాదారులకు నోటీసులు జారీ చేసి, అఫిడవిట్ సేకరించాలని సూచించారు. పారదర్శకంగా విచారణ జరిపి, ఏప్రిల్ 30లోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో భూక్య యాకన్న, డిప్యూటీ ఎంఆర్వో సిహెచ్. అనిల్ కుమార్, గిర్ధవార్లు జయలక్ష్మి, చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ ధనలక్ష్మి మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జీవన విధానాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్న ఇసుక మాఫియా సమస్య



**కరీంనగర్,ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో గత మూడు నెలలుగా కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణా గ్రామ ప్రజల జీవన విధానాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని 3వ వార్డు సభ్యుడు బండారి ప్రశాంత్ తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసిన తర్వాత పరిస్థితి మరింత దిగజారిందని ఆయన పేర్కొన్నారు. చెక్‌పోస్ట్ కారణంగా ఇసుక మాఫియా కార్యకలాపాలు గ్రామంలోని అంతర్గత వీధుల వైపు మళ్లి, రోజుకు 300కు పైగా ట్రాక్టర్లు అధిక వేగంతో రాకపోకలు సాగిస్తున్నాయని వివరించారు. దీంతో గ్రామంలోని రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దుమ్ము, శబ్ద కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, మహిళలు రోడ్లపై నడవడం ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చిన్నపాటి ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలు ఇసుక మాఫియా నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఆయుష్ శాఖ సమక్షంలో యోగా, మెగా వైద్య శిబిరం

**కరీంనగర్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రేపు (ఏప్రిల్ 10) కరీంనగర్‌లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా శిబిరం, మెగా వైద్య శిబిరం జరగనుంది. హోమియోపతి వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనీమాన్ జయంతి సందర్భంగా అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 6:30 గంటలకు యోగా శిబిరం ప్రారంభమవుతుంది. అనంతరం రాంనగర్‌లోని ఆయుష్ ఆసుపత్రిలో ఆయుర్వేద, హోమియో, యునాని విభాగాల ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ జరుగుతుంది. దీర్ఘకాలిక వ్యాధులు, దగ్గు, దమ్ము, అస్తమా వంటి సమస్యలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ఆవిష్కరించారు. అధికారులు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

# ఘనంగా ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కరీంనగర్/హుస్నాబాద్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యుఐ) 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరీంనగర్, హుస్నాబాద్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. హుస్నాబాద్‌లో నియోజకవర్గ అధ్యక్షుడు సనత్ రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద జెండా ఆవిష్కరణ చేసి, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, సమానత్వం, ప్రజాస్వామ్య ఆదర్శాల కోసం ఎన్ఎస్‌యుఐ ఎల్లప్పుడూ పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్ డిసిసి కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి తాళ్ల సుమంత్, మాజీ జిల్లా కార్యదర్శి ఎం.డి. ఇమ్రాన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఆయన జెండా ఆవిష్కరించి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. సభలో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం, దేశభక్తి, లౌకిక భావాల పెంపొందన కోసం ఎన్ఎస్‌యుఐ స్థాపించబడిందని, ఈ విభాగం నుంచి అనేక మంది నాయకులు ఎదిగి దేశవ్యాప్తంగా కీలక పదవులు చేపట్టారని సత్యం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగాన్ని దేశానికి రోల్ మోడల్‌గా నిలపడానికి కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కార్పొరేషన్ అధ్యక్షులు, కాంగ్రెస్ నేతలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ కార్యకర్తలు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

# శాతవాహన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



**కరీంనగర్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

2026--27 లయనిస్టిక్ సంవత్సరానికి శాతవాహన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఎన్నికలను సీనియర్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి పర్యవేక్షించారు. అధ్యక్షుడిగా లయన్ మర్రిపల్లి మహేందర్, కార్యదర్శిగా లయన్ నార్ల వేణుగోపాల్, కోశాధికారిగా లయన్ సిఏ మెరుగు ప్రవీణ్ కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మహేందర్, వేణుగోపాల్‌లు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో సమగ్రంగా పనిచేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గానికి లయన్ కె రాజేందర్ రెడ్డి, బి నర్సింగరావు, ఈ రమేశ్, వీ జగదీశ్వరాచారి, సిహెచ్ రాజి రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు లయన్ డి తిరుపతి రెడ్డి, కార్యదర్శి జి చంద్రశేఖర్, కోశాధికారి పి సురెందర్, అలాగే డా. రమణాచారి, కె అనంతరెడ్డి, డా. ఎస్ మనోహరాచారి, సిహెచ్ రాంమోహన్ రావు, జె సి ప్రకాశ్, డా. వి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కళాశాలల ఫీజులపై విచారణ చెయ్యాలని యుఎస్ఎఫ్ఐ డిమాండ్




**కరీంనగర్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థులపై అనేక రకాల ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపిస్తూ, వాటిపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి సంద గణేష్ డిమాండ్ చేశారు. జిల్లా నాయకుల సమావేశంలో మాట్లాడిన ఆయన, అడ్మిషన్ సమయంలో వసూలు చేసిన ఫీజులు తిరిగి ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అటెండెన్స్ ఫీజు, ల్యాబ్ ఫీజు, యూనిఫామ్ ఫీజు పేర్లతో అదనపు భారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా, కళాశాల యజమాన్యాలు మరింత ఒత్తిడి చేయడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. రీయింబర్స్‌మెంట్ అంశం ప్రభుత్వం--యజమాన్యం మధ్య పరిష్కరించుకోవాల్సినదే తప్ప విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఫీజులు చెల్లించని విద్యార్థుల ఎగ్జామ్ ఫీజులు తీసుకోకుండా ఇబ్బందులు కలిగిస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే జేఎన్టీయూ యూనివర్సిటీ ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మని తేజ, అభిలాష్, ఉమామహేశ్వర్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ప్రతిపక్ష ఐక్యత



**హుస్నాబాద్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతిపక్ష పార్టీలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు, వార్డు ప్రజలు కలిసి మున్సిపల్ కమిషనర్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ రోడ్ల విస్తరణ పనుల కారణంగా అనేక వార్డుల్లో ఇంటి పైపులు దెబ్బతిని నీటి సరఫరా నిలిచిపోయిందని, నీరు అందకపోయినా పన్ను బిల్లులు జారీ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. వెంటనే పాత బిల్లులను రద్దు చేసి పైపులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఖాళీ ప్రదేశాల్లో నీరు నిలిచి తుంగ మొలకల ద్వారా దూది, సూక్ష్మ క్రిములు వ్యాపించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని, ముఖ్యంగా 7వ, 17వ వార్డుల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే తుంగ తొలగించాలని కోరారు. ఇంటి పన్నుల రివిజన్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వాటిని సరిచేయాలని, మున్సిపల్ కార్యాలయంలో సమర్పించే దరఖాస్తులకు సరైన పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వినతిపత్రం సమర్పణలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, కౌన్సిలర్ గాదపాక రవీందర్, బిఆర్ఎస్ ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి, లోక్ సత్తా జిల్లా అధ్యక్షుడు మల్కా రెడ్డి మోహన్ రెడ్డి, జేఏసీ కో-కన్వీనర్ మేకల వీరన్న యాదవ్, మాజీ కౌన్సిలర్ వల్లపు రాజు, వార్డు ప్రజలు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను విన్న మున్సిపల్ కమిషనర్ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఎరుకల కులస్తులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్




**పెద్దపల్లి, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రాష్ట్రంలో 8 లక్షల జనాభా కలిగిన ఎరుకల కులస్తులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చకపోవడం బాధాకరమని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి అన్నారు. పెద్దపల్లి పట్టణ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎరుకల కులస్తులకు సామాజిక, రాజకీయ, ఆర్థిక అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలుగా అవకాశాలు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పందుల పెంపకం కోసం షెడ్లు నిర్మించుకున్న ఎరుకల కులస్తులపై అగ్రవర్గాల దాడులు జరుగుతున్నాయని, ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి కుటుంబానికి 5 ఎకరాల భూమి కేటాయించాలని, ప్రత్యేక ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎరుకల సంస్కృతికి చెందిన తట్టల అల్లకము, నాంచారమ్మ సోది, నాంచారమ్మ జాతర, ఏకలవ్య జయంతి వంటి కార్యక్రమాలను అధికారికంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని సూచించారు. పందుల పెంపకందారులకు శిక్షణ ఇచ్చి 100% సబ్సిడీతో ఫార్ములు ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీలలో పంది మాంసం దుకాణాల కోసం ప్రత్యేక షట్టర్లు కేటాయించాలని కోరారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రుణాలు ఇవ్వడంతో పాటు ప్రత్యేక ఎస్‌టీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మానుపాటి శ్రీనివాస్, తిరుపులు సంపత్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రేవెళ్లి తిరుపతి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ఉండ్రాళ్ల ఎల్లర్య, సార్ల తిరుపతి, లోకిని శారద, కర్ర రామమల్లమ్మ, మానుపాటి కనుకమ్మ, బిజిలి శ్రీనివాస్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్ఓ భీమా నాయక్



**కల్వకుర్తి, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని వన్ టూ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ భీమా నాయక్ మాట్లాడుతూ, వృద్ధులకు ఎల్లవేళలా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం జి.జి.హెచ్., రఘుపతిపేట పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది శిబిరం నిర్వహించారు. వృద్ధులకు రక్తపరీక్షలు, బీపీ పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. అనంతరం జరిగిన అవగాహన కార్యక్రమంలో భీమా నాయక్ వృద్ధులు ఆరోగ్య పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు పెరుమాళ్ళ వెంకటయ్య, డాక్టర్ అత్త ఉల్లా ఖాన్, డాక్టర్ వర్షిత్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ ప్రమోద్, నర్సింగ్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఫిజియోథెరపిస్ట్ లలిత, కోఆర్డినేటర్ పద్మ, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, వృద్ధులు పాల్గొన్నారు.

# ఆదర్శ రైతుల వ్యవస్థ పునరుద్ధరించాలి



**అమ్రాబాద్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అమ్రాబాద్ మండల కేంద్రంలో జరిగిన రైతు సదస్సులో ఆదర్శ రైతులు ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శ రైతుల వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు 2007లో ప్రారంభమైన ఈ వ్యవస్థ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం చేరవేయడంలో కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ప్రతి 250 కుటుంబాలకు ఒక ఆదర్శ రైతు నియమించడం ద్వారా సాగు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం సులభమైందని తెలిపారు. వ్యవసాయంతో పాటు పశుసంవర్ధక, మత్స్య, మార్కెటింగ్ శాఖల పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆదర్శ రైతులు బహుముఖ సేవలు అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20 వేల ఆదర్శ రైతుల ఉపాధిని కాపాడాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఆదర్శ రైతులు సామ పాండు, గౌస్ అహ్మద్, మల్లయ్య, శివలింగం, మల్లయ్య చిన్న రాయుడు పాల్గొన్నారు.

# రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకై రైతు సంక్షేమ కమిషన్ కృషి

**అమ్రాబాద్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లమల్ల ఏజెన్సీ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ కృషి చేస్తుందని కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి తెలిపారు. అమ్రాబాద్ మండల కేంద్రంలో జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో భూమి హక్కుల గుర్తింపు, పత్రాల సమస్యలు, సాగు భూముల వివాదాలు రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, ఈ సమస్యలను నేరుగా రైతుల వద్దకు వెళ్లి తెలుసుకొని పరిష్కార మార్గాలను సూచించేందుకు కమిషన్ క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టిందని చెప్పారు. రైతుల భూ సమస్యలను సమగ్రంగా పరిశీలించి, ముఖ్యంగా గిరిజన రైతుల హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం వద్ద నివేదిక





సమర్పిస్తామని, రైతుల సంక్షేమం కోసం కమిషన్ కట్టుబడి పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుత ప్రభుత్వం రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సక్సెషన్ ప్రక్రియలను పూర్తి చేసి బ్యాంకులతో సమన్వయం చేసి రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని, కమిషన్ కృషి చేస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు, అదనపు కలెక్టర్ అమరేందర్, అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే - అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక



**ఎలిగేడు, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జ్యోతిరావు పూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఎలిగేడు మండల కేంద్రంలో కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా పల్లెర్ల వెంకటేశ్ గౌడ్ (సర్పంచ్--నర్సాపూర్), ముఖ్య సలహాదారుగా న్యాతరి పోచయ్య, ఉపాధ్యక్షులుగా గోష్కి శంకర్, ఇరుగురాల సదానందం, ప్రధాన కార్యదర్శులుగా కవ్వంపల్లి నారాయణ, తాండ్ర అంజయ్య, కార్యదర్శులుగా జల్లి రమేశ్, బోయిని సత్యం, రాయపాక మనోహర్, ఎర్రోల్ల మల్లేశం, ప్రచార కార్యదర్శులుగా చెవుల అజయ్, ఆసంపల్లి రవీందర్, వడ్లూరి శ్రీనివాస్, ఎర్రోళ్ల శంకర్, కోశాధికారిగా మలారపు అంజయ్య ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కప్పల ప్రవీణ్, కవ్వంపల్లి బాపయ్య, మద్దెల రమాదేవి సంపత్, రంగులత శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ పొన్నాల అనిల్, మాజీ ప్రజాప్రతినిధులు మండిగ రాజనర్సయ్య, కవ్వంపల్లి దుర్గయ్య, కాంపెల్లి ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బాసంపల్లి శ్రీనివాస్, బాసంపల్లి వినోద్ తదితరులు పాల్గొన్నారు.


## ఎయిడ్స్‌కు అవగాహనే మందు

-- మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా




**ఎలిగేడు, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హెచ్ఐవీ--ఎయిడ్స్‌కు మందు లేదని, ముందస్తు జాగ్రత్తలే అసలైన రక్షణమని ఎలిగేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల్లో అవగాహన పెంపొందితేనే వ్యాధి నివారణ సాధ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్ రావు, సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ తప్పక వేయాలి -- నిస్సీ క్రిస్టీనా





వ్యాక్సిన్ ప్రారంభిస్తున్న ఎంపీడీవో భాస్కర్ రావు స్థానిక సర్పంచ్ కప్పల ప్రవీణ్ వైద్యాధికారిని నిస్సి క్రిస్టిన.

**ఎలిగేడు, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ తప్పక వేయాలని ఎలిగేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా సూచించారు. సెర్వికల్ క్యాన్సర్ నివారణలో భాగంగా గురువారం ఆమె వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తల్లిదండ్రులు తమ కుమార్తెలను ప్రోత్సహించి ఈ వ్యాక్సిన్ తప్పక వేయించాలని కోరారు. ఆరోగ్యకేంద్రంలో 14--15 ఏళ్ల బాలికలకు ప్రతిరోజూ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని, ఇప్పటికే 20 మందికి టీకా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్ రావు, సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉపసర్పంచ్ మారం రాయమల్లు, స్టాఫ్ నర్సులు వీణా రాణి, స్వప్న, సూపర్వైజర్లు నాగలక్ష్మీ, లక్ష్మన్, ఏఎన్ఎంలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గరికపాటి ప్రవచనం

**వినోభానగర్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వినోభానగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో నేడు సాయంత్రం 5 గంటల నుండి 8 గంటల వరకు పద్మశ్రీ, ప్రవచన చక్రవర్తి గరికపాటి నరసింహారావు గారు గోవిందుడు -- గోసంరక్షణ అంశంపై ప్రవచనం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని జరిపిటి అంజలీదేవి, ఆంజనేయులు దంపతులు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రవచనం విని తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆలయ చైర్మన్




గుబ్బా మహేష్, ప్రాజెక్ట్ చైర్మన్ గుంత సాంబమూర్తి, వైస్ చైర్మన్ తుమ్మనపల్లి జగదీశ్వర్, కమిటీ అధ్యక్షుడు ఇల్లెందుల సంతోష్, ప్రధాన కార్యదర్శి యంసాని శ్రీనివాస్, కోశాధికారి అత్తెల్లి ప్రవీణ్ కోరారు.

## ప్రధాన రహదారిపై రాత్రివేళ చీకటి సమస్యతో ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు



**పాలకుర్తి, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి రాత్రివేళ చిమ్మచీకటితో నరకయాతనగా మారింది. ఈశాల తక్కల్లపల్లి, పాలకుర్తి, రామారావుపల్లి గ్రామాల నుండి అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కార్మికులు, విద్యార్థులు ప్రతిరోజూ ఈ దారిలో ప్రయాణం చేస్తున్నారు. వెలుతురు లేకపోవడంతో సైకిల్ పై వెళ్తున్న వారు బైక్ లైట్లలోనే గమ్యానికి చేరుకోవాల్సి వస్తోంది. గుంతల రహదారి, చీకటి కారణంగా ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కేశోరాం సిమెంట్ కంపెనీ వీధి దీపాల కోసం స్తంభాలు ఏర్పాటు చేసినా అవి అలంకారప్రాయంగానే మిగిలిపోయాయి. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు అల్ట్రాటెక్ కంపెనీ అధికారులను కోరినా స్పందన లభించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రయాణికుల భద్రత కోసం వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## పూలే 199వ జయంతి ఉత్సవాలను విజయవంతం చెయ్యాలని పిలుపు



**కరీంనగర్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ పూలే బీసీ సంక్షేమ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి అయిలన్న కురుమ, జిల్లా కార్యదర్శి మేకల నర్సయ్య కలెక్టరేట్ సమీపంలోని సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావ్ పూలే 199వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన పూలే చేసిన త్యాగాలు, ధైర్యసాహసాలను నేటి తరానికి వివరించి, ఆయనను స్మరించుకోవడం అవసరమని తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలు, రాష్ట్ర రాజధానిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే అధికారిక కార్యక్రమాలలో ప్రజలు, కుల సంఘాల నాయకులు, రాజకీయ పార్టీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పూలే సమాన సమాజ నిర్మాణం కోసం, ముఖ్యంగా బాలికల విద్య కోసం తన భార్యను తొలి ఉపాధ్యాయురాలిగా తయారు చేసి పాఠశాలలు ఏర్పాటు చేసిన మహనీయుడని, కులమతాలకతీతంగా బహుజనుల అభివృద్ధికి జీవితాన్ని అర్పించిన మహాత్మునికి ఘన నివాళి అర్పించాల్సిన అవసరం ఉందని అయిలన్న అన్నారు.

## 'ఆరోగ్యమే అసలైన ఐశ్వర్యం'

**ఆమనగల్లు, ఏప్రిల్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే అసలైన ఐశ్వర్యం అని పీ. హెచ్.సి డాక్టర్ మైమున బేగం అన్నారు. 'ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ' ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు శాంతి నగర్ కాలనీలోని






కోట మైసమ్మ ఆలయం వద్ద హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము, 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ళ జగన్ హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ మైమున బేగం మాట్లాడుతూ.. పని ఒత్తిడిలో పడి చాలా మంది ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. శారీరక శ్రమపైనా దృష్టి పెట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో వ్యాయామానికి, సరైనా ఆహారానికి ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పొగ తాగడం, మద్యపానం వంటి చెడు అల వాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ తిరుపతి రెడ్డి అలీమ్, ఎఎన్ఎం సీతమ్మ, మాధవి, ఆశావర్కర్లు అలివేలు, నిర్మల, సంతోష, లక్ష్మి, విజయ సల్మా మరియు నాయకులు శ్రీను నాయక్, తాళ్ల రఘు, మోహన్ సింగ్ బ్రహ్మం, రామకృష్ణ సాయి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ వినియోగంలో ఆదర్శంగా కొత్తపేట గ్రామం

**మహబూబాబాద్, ఏప్రిల్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గ్రామంలో 24 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలనే నియమాన్ని అమలు చేసింది. ఈ కెమెరాలను జిల్లా ఎస్పీ డా. శబరీష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సమ్మక్క--సారక్క దేవాలయం నుండి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా, గ్రామ ప్రజలు, యువత హెల్మెట్లతో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కెమెరాలను ఎస్పీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య ప్రవీణ్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి



ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా వాడేలా చర్యలు తీసుకుంటామని, గంజాయి నిర్మూలనలో తమ వంతు పాత్ర పోషిస్తూ యువతను మంచి మార్గంలో నడిపించేలా కృషి చేస్తామని తెలిపారు. ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ, కొత్తపేట గ్రామం తీసుకున్న నిర్ణయం ఎంతో అభినందనీయమని, హెల్మెట్ వినియోగం ప్రాణాలను కాపాడుతుందని, త్వరలోనే ఈ గ్రామాన్ని గంజాయి రహిత గ్రామంగా చూడాలని ఆకాంక్షించారు. అనంతరం ఎల్ఈడి స్క్రీన్ ద్వారా హెల్మెట్ వినియోగం ప్రాముఖ్యతపై అవగాహన వీడియోలు ప్రదర్శించగా, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బయ్యారం సీఐ రవీందర్, ఎస్ఐ తిరుపతి, గ్రామ పెద్దలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లోడి సంఘీక సేవా సంస్థ సేవలు అభినందనీయం

-హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్.రవి







**హన్మకొండ, ఏప్రిల్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
లోడి సంఘీక సేవా సంస్థ సేవలు అభినందనీయమని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్.రవి అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మరియు లోడీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఫాతిమా నగర్ లోని లోడి సంఘీక సేవా సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద మెగా ఎయిడ్స్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్ రవి దిర్ఘకాలిక వ్యాధి తో జీవిస్తున్న చిన్నారులకు పోషక ఆహార కిట్స్ పంపిణి చేశారు.అనంతరం లోడీ సంఘీక సేవా సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి సమాజ ప్రగతికి చిహ్నాలు కనుక వారికి విద్య, వైద్యం మరియు నాణ్యమైన పోషక ఆహారాన్ని అందించడం ద్వారా ఆరోగ్య సమాజాన్ని సాధించవచ్చు అని తెలియజేయడం జరిగింది. చిన్నారులకు నైతికంగా, అండగా ఉండడమే కాకుండా వారికి మనోధైర్యాన్ని ఇస్తూ పోషకాహార కిట్ లను అందిస్తున్న లోడి సంస్థ ను ఆయన అభినందించారు. ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో ప్రభుత్వ విభాగాలతో పాటు స్వచ్ఛంద సంస్థల కృషిని ఆయన అభినందించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.అప్పయ్య మాట్లాడుతూ పిల్లలు అతిసాధారణంగా ఎదురుకునే రక్తహీనత, ఎత్తు కు తగ్గ బరువు వంటి సమస్య లను అదిగమించడానికి ఇటువంటి పోషకహార కిట్స్ ఎంతగానో ఉపయోగ పడతాయని తెలియజేసారు.లోడి స్వచ్ఛంద సంస్థ గత 20 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం ద్వారా 250 మంది చిన్నారులకు ప్రతి రెండు నెలలకు ఒకసారి అందించడానికి ముందుకు రావడం చాలా అభినందనీయమని పాదర్ ఇన్నారెడ్డి ద్వారా ఇలాంటి సేవలు ఇంకా అందించే దిశ గా కృషి చేయాలని అడిషనల్ డి ఎం హెచ్ ఓ డా.మదన్మోహన్ రావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న మాధురి, డెమో అశోక్ రెడ్డి ఐసీటీసీ సూపర్వైజర్ రామకృష్ణ, డాటా మేనేజర్ కమలాకర్,ఫ్రోగ్రాం కోఆర్డినేటర్ వీరబాబు, బాల శౌరీ, నాగేష్,లోడి సేవా సంస్థ కార్యకర్తలు శిరీష, అనిత, రాకేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు

-మాజీ మంత్రి హరీష్ రావు



**ఆమనగల్లు, ఏప్రిల్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. ఇటివలే తెలంగాణ భవన్ లో 300 మందితో టీఎస్ఎస్ఓ నుండి బీఆర్ఎస్వి లో చేరిన మీసాల వర్షిత్ గురువారం హైదరాబాద్ లోని హరీష్ రావు నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూటకపు హామీలతో యువతను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. యువ వికాసం, విద్యాజ్యోతి పథకాలు ప్రకటించి కాంగ్రెస్ పార్టీ యువత ఓట్లు దండుకొంది. అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఇంతవరకు వాటి ప్రస్తావనే లేకపోవడం శోచనీయం అన్నారు. అమలుకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ధోకాను, అవినీతిని ఇంటింటికీ వివరించాలన్నారు.

# నూతన ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు కు సన్మానం




**ఆమనగల్లు, ఏప్రిల్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు ఎస్.హెచ్.ఓ గా ఇటీవల బదిలీపై ఆమనగల్లు పోలీస్ స్టేషన్ వచ్చిన వెంకటేశ్వర్లు ను గురువారం మున్సిపాలిటీ పరిధిలోని విఠయిపల్లి పెంట తండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకర్ నాయక్, యువ నాయకుడు కొమ్ము ప్రసాద్ ల ఆధ్వర్యంలో శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్.హెచ్.ఓ ను సన్మానించిన వారిలో యువకులు శ్రీను, జగన్ ఉన్నారు.

# ఎన్ఎస్ఈయుఐ సేవలు ప్రశంసనీయం

–టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు, ఏప్రిల్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎన్ఎస్ఈయుఐ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని టీపీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఎన్ఎస్ఈయుఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, ఎన్ఎస్ఈయుఐ జెండాను ఆవిష్కరించి, కేక్ కటింగ్ చేశారు. అనంతరం ఎండి. ఫరీద్ మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఎంతోమంది తొలి తరం నాయకులకు ఎన్ఎస్ఈయుఐ ఒక శక్తివంతమైన వేదికను కల్పించిందన్నారు. ఇక్కడ తమ ప్రస్థానాన్ని ప్రారంభించిన వారిలో అనేకులు నేడు ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా మరియు ముఖ్యమంత్రులుగా కూడా దేశానికి సేవలందిస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా, ఎన్ఎస్ఈయుఐ లక్షలాది మంది విద్యార్థులకు వారి విద్యాపరమైన ప్రస్థానంలో సహాయపడిందని వారిలో అనేకులు ఇప్పుడు దేశ నిర్మాణంలో తమ వంతు కృషి చేస్తున్నారని, విద్యార్థుల సమస్యలను లేవనెత్తడంలోనూ, మన దేశ సామాజిక ఐక్యతను పరిరక్షించడంలోనూ ఎన్ఎస్ఈయుఐ ఎల్లప్పుడూ అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, ఆయా మండలాల అధ్యక్షులు తెల్గమల్ల జగన్, బిచ్యా నాయక్, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, సింగల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, కాలే మల్లయ్య, ఎంగలి ప్రసాద్, అబ్దుల్ అలీమ్, కండె సాయి, షాబొద్దిన్, సురేష్ నాయక్, నాజర్ దేవరశెట్టి మహేష్, కుమార్ గౌడ్, ఎన్ఎస్ఈయుఐ నాయకులు మహేష్, అబేద్, సలీం, పవన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితురాలికి అండగా...



**ఆమనగల్లు, ఏప్రిల్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తమతో కలిసి చదువుకొని ఆటపాటల్లో తమతో కలిసి మెలసి తిరిగిన తమ స్నేహితుల కుటుంబాలు ఆపదలో ఉండటం వారిని కలిచి వేసింది. స్నేహితురాలు కుటుంబం బాగా ఉండటం కోసం ఆదుకోవాలని వారంతా భావించారు. ఒకరికొకరు ఫోన్లు చేసుకొని ఆర్థిక సహాయం చేయడానికి అంతా కలిసి ముందుకు వచ్చారు. స్నేహితురాలు జ్యోతి కుటుంబానికి 30.000 వేల రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని జి యు పి ఎస్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న స్నేహితురాలు జ్యోతి భర్త అకస్మాత్తుగా ద్విచక్ర వాహనం ఢీకొని ఇటీవలే మరణించడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు జ్యోతి కుటుంబానికి రూ.30.000 వేల రూపాయలు అందజేశారు.ఆపద సమయంలో ఉన్న స్నేహితురాలి కుటుంబాలను పూర్వ విద్యార్థులు ఆదుకోవడం పట్ల పట్టణ ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయుడు, ఆనంద్, బిక్షపతి, శేఖర్, రాంబాబు, ఆఫ్సర్, వెంకన్న, శమంతా, సుగుణ, రజిత, అండాలు, మహేశ్వరి, వెంకటమ్మ, వెంకటేశ్వరి, సంతోష, లలిత, జయమ్మ, నిర్మల, సువర్ణ, సరిత, బౌరమ్మ, యాదమ్మ శారదా, ఇమ్రాన్, రేణుక ఉన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్, ఎంపీడీవో మాధురి, సర్పంచ్ సరిత
- సీతారామ్ నగర్ తండాలో మద్యపాన నిషేధం
- ఉల్లంఘిస్తే రూ.50 వేల జరిమానా
- పంచాయతీ పాలకవర్గం తీర్మానం





**ఆమనగల్లు, ఏప్రిల్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
యువత మత్తు పదార్థాలకు బానిసలై, భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని, మాదక ద్రవ్యాల రహిత సమాజంగా నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమనగల్లు ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్, ఎంపీడీవో కుసుమ మాధురి, సర్పంచ్ సరిత అన్నారు. ఆమనగల్లు మండలం పులిగోని పల్లి తండాలో బుధవారం రాత్రి పోలీసు, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తండాకు చెందిన రాందాస్ నాయక్ అనే వ్యక్తి ఇటీవల మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి భార్య, ఇద్దరు పిల్లలపై రోకలితో దాడి చేసిన ఘటన నేపథ్యంలో సీతారాంనగర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో మద్యపాన నిషేధానికి గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానించి పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులకు నివేదించారు. ఆయా శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం, యువకులు రాందాస్ నాయక్ దాడిలో మృతి చెందిన కవిత, హర్షలకు సంతాప సూచకంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వర్లు, బద్యనాథ్ చౌహాన్, మాధురి, సరిత మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాలకు ప్రతీ ఒక్కరూ దూరంగా ఉండాలని కోరారు. గ్రామంలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై సీతారాంరెడ్డి, ఉపసర్పంచ్ దీపిక, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, తండా నాయకులు, యువకులు, పోలీసు, ఎక్సైజ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామ్ నగర్ తండాలో మద్యపాన నిషేధం మండల పరిధిలోని సీతారామ్ నగర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో మద్యపాన నిషేధం అమలుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎవరైనా తీర్మానం ఉల్లంఘిస్తే రూ.50 వేలు జరిమానా విధించనున్నట్లు గ్రామసభలో పంచాయతీ పాలకవర్గం పేర్కొంది. ఆమనగల్లు మండలం సీతారామ్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పులిగోనిపల్లి తండా, సీతారామ్ నగర్ తండాలో కొంతకాలంగా విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ పరిధిలో మద్యపాన నిషేదానికి గ్రామస్తులు నిర్ణయించారు. సీతారామ్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం రాత్రి సర్పంచ్ బాణావత్ సరిత అధ్యక్షతన పాలకవర్గం సమావేశం నిర్వహించారు. గ్రామసభలో అందరి సమక్షంలో మద్యపాన నిషేధ గ్రామంగా తీర్మానించారు.

# నీటి నిల్వ సామర్థ్య పెంపుపై దృష్టి: ఎమ్మార్వో

**ఆళ్లగడ్డ ఏప్రిల్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి. ఆర్. కృష్ణాపురం గ్రామాల్లో చెరువులను ఆళ్లగడ్డ ఎమ్మార్వో జ్యోతి రత్నకుమారి గురువారం పరిశీలించారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా చెరువులలో పూడికతీత పనులు చేపట్టి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతామని ఆమె తెలిపారు. మైనర్ ఇరిగేషన్ శాఖ, సాగునీటి సంఘాల సమన్వయంతో పనులు చేపడతామని పేర్కొన్నారు.